**రాంబాబుకు జలుబు చేసి మూడ్రోజులైంది.**

**ముక్కు మూసుకుపోయి రెండ్రోజులైంది. చెవులు దిబ్బడేసి ఒక్కరోజైంది. వాయుగుండం ఏర్పడినపుడు కురిసే అకాల వర్షాల్లాగా ముక్కు ఏకధాటిగా కారుతూనే వుంది. వాయుగుండం తీరం దాటేటప్పుడు పెనుగాలులతో తుఫానుగా మారినట్టు.**

**రాంబాబు జలుబు, తలనొప్పి, జ్వరం, దగ్గు దిశగా మారింది.**

మోర్నింగ్ వాకింగ్‌కు వెళ్లిన మురళి- మూడ్రోజులనుంచి రాంబాబు మోర్నింగ్ వాకింగ్‌కు గైర్‌హాజరీ అయినట్టు గ్రహించాడు. మొన్న దీపావళి కొచ్చిన బోనస్‌తో ఎంజాయ్ చేస్తున్నాడు గాబోలని సరిపెట్టుకున్నాడు. ఏదేమైనా తెలుసుకుంటే పోలా- అన్న క్యూరియాసిటీతో రాంబాబింటికెళ్ళాడు మురళి.

మురళిని చూసిన రాంబాబు కూర్చోమంటూ సైగ చేసి, 'రొంబ' రా అంటూ ముక్కువైపు చూపించాడు. సిన్మా యాక్టర్లంటే విపరీతమైన క్రేజ్ వున్న మురళికి అది 'రంభ'లా విన్పించింది. 'ఎక్కడరా' అంటూ లోనికి తొంగి చూసి, 'రంభ ఏదిరా?' అన్నాడు క్యూరియాసిటీగా. 'రంభ లేదూ, మేనక లేదూ జలుబురా' అన్నాడు మిమిక్రీ చేస్తున్నట్టు రాంబాబు.

చెయ్యి పట్టి చూసి "జ్వరం కూడా ఉన్నట్టుంది ఏం మందులు వాడుతున్నావేంటి?" అన్నాడు తను. దిన, వార పత్రికల్లో చదివిన మెడికల్ నాలెడ్జిని గుర్తు తెచ్చుకుంటూ మురళి.

"జలుబేగా అదే సర్దుకుంటుంది, దీనికి మందులెందుకు? ఇఫ్‌యూ ట్రీట్ ది కోల్డ్ ఇట్ విల్ బి క్యూర్డ్ వితిన్ ఎ వీక్, ఇఫ్ నాట్ విత్ ఇన్ సెవెన్ డేస్" అన్నాడు మురళి నవ్వుతూ. తనేసిన జోకుకు తనే కొంచెం ఓవర్ అయ్యేసరికి దగ్గు వచ్చింది.

"చిన్న పామునైనా పెద్ద కర్రతో కట్టాలి, జలుబని అశ్రద్ధ చేస్తే చూశావా! ఎలా దగ్గుతున్నావో అదే ఊపిరితిత్తులకు పాకి నిమోనియాగా మారవచ్చు, తలకెక్కి సైనస్‌గానో, ముక్కులో ఇన్‌ఫెక్షన్ చెవిలో కెళ్ళి నొప్పి రావచ్చంటూ తన మెడికల్ నాలెడ్జినంతా చెప్పి భయపెట్టాడు మురళి రాంబాబుని. ఆలోచనలో పడ్డాడు రాంబాబు. ఈలోపు ఇంకో దగ్గు తెరవచ్చింది. ఆపుకున్నాడు రాంబాబుకి భయపడి.

"ఇవ్వాళా రేపు కొత్త కొత్త జబ్బులు అనేకం పుట్టుకొస్తున్నాయి, ఎందుకన్నా మంచిది అర్జెంటుగా ఒక పెద్ద డాక్టరును సంప్రదిద్దాం రా" అంటూ తొందర చేశాడు మురళి.


"దీనికి డాక్టరు దాకా ఎందుకు విక్స్ ఏక్షన్ 500 వేసుకుంటే పోలా?" అన్నాడు రాంబాబు తన టి.వి పరిజ్ఞానంతో.

ఇంతలో... ఇంట్లోని వంటగదిలోంచి "మిరియాల కషాయం రెడీ" అంటూ కేక విన్పించింది.

"కషాయాలు, ముక్కుపొడుంలు, ఆవిరిలు, అమృతాంజనాలు బి.సీ.నాటివిరా లేటెస్టు విజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి. మనం ఇరవై ఒకటో శతాబ్దంలో వున్నాం" అంటూ మురళి ఇంకో క్లాసు పీకాడు.

# యు.ఆర్.ఐ.

డాక్టర్ ఎన్.వి.రామరాజు




"కషాయాలు,
ముక్కుపొడుంలు,
ఆవిరిలు,
అమృతాంజనాలు
బి.సీ.నాటివిరా
లేటెస్టు విజ్ఞానాన్ని
అందిపుచ్చుకోవాలి.
మనం ఇరవై ఒకటో
శతాబ్దంలో వున్నాం"


కథ

ఇద్దరూ డాక్టరు దగ్గరకు బయలుదేరారు.

రాంబాబు జీతం తీసుకుని అప్పటికి నాలుగు రోజులే అయ్యింది. పేపరుకు, పాలవాడికి, పనిమనిషికి, ఇంటి అద్దె, కేబుల్ కనెక్షన్‌కి ఇంకా డబ్బులివ్వనేలేదు. బోనస్ కూడా రావడంతో పర్సు బరువుగా వుంది.

ఇద్దరూ ఆటోలో డాక్టర్లుండే నక్కల వీధికెళ్ళారు. సదరు డాక్టరుగారి హాస్పిటల్ ముందాపి మామూలుకన్నా ఎక్స్ట్రా డిమాండ్ చేశాడు ఆటోవాలా. 'కౌంట్ డౌన్ స్టార్ట్స్' అన్నాడు మురళి నవ్వుతూ.

హాస్పిటల్ లోనికెళ్ళగానే "డాక్టర్ గారిని సంప్రదించ వలసినవారు వంద రూపాయలు రిసెప్షన్‌లో చెల్లించి టోకెన్ తీసుకొనగలరు" అన్న బోర్డు కన్పించింది.



వంద రూపాయలు సమర్పించు కొన్న తర్వాత 'మీ నెంబర్ ఫార్టీ' అంది రిసెప్షనిస్ట్ పళ్లికిలిస్తూ. 'నా ఏజ్ కూడా సేమ్. వాటే కో ఇన్సిడెంట్' అన్నాడు మురళి రిసెప్షనిస్ట్ వంక కొంటెగా చూస్తూ.

'నలభై అంటే మన వంతు వచ్చేసరికి ఎంత టైం అవుతుందో కదరా? కనీసం టీ అయినా తాగనీయకుండా లాక్కొచ్చావు' అన్నాడు రాంబాబు నీరసంగా.

'డోంట్ వర్రీ! అటు చూడరా! అంటూ పక్కనున్న వెయిటింగు హాల్ చూపించాడు మురళి. ట్వంటీ నైన్ ఇంచెస్ కలర్ టీ.వి.లో ఏదో సీరియల్ వస్తుంది. అదో మినీ థియేటర్‌లా వుంది. అక్కడవున్న పేషెంట్స్ అంతా మంత్రముగ్ధుల్లా కూర్చుని గుడ్లప్పగించి టీ.వి. కేసి చూస్తున్నారు. పక్కన బాంబు పేలినా కదిలేలా లేరు. ఒక దాని తర్వాత ఒక టొచ్చే సీరియస్, సెంటిమెంట్ సీరియల్స్, ఐదు నిముషాలకొకసారొచ్చే ఎడ్వర్‌టైజ్‌మెంట్స్ చూసి రాంబాబుకి తలనొప్పి ఎక్కువైంది. ఇంక కూర్చొనే ఓపిక లేక జుట్టు పీక్కుంటూ 'తర్వాత వద్దాంలేరా!' అంటూ లేవబోతుండగా...

"నెంబర్ ఫార్టీ రాంబాబు అంటూ" స్వీట్‌గా ఒక గొంతు పిల్చింది.

ఇద్దరూ డాక్టరుగారి కన్సల్టేషన్ రూములోనికెళ్ళగానే ఏ.సి. గాలి ముఖాలకు తగిలి ప్రాణం సేదదీరినట్లైంది.

పెద్ద గది. ఇంటీరియర్ డెకరేషన్... పెద్ద టేబులు, రివాల్వింగ్ చైర్... ఆ అట్టహాసం చూసి పెద్ద డాక్టరే అనుకున్నాడు మురళి.

రాంబాబుని రెండు మూడు ప్రశ్నలేసి స్టెతస్కోపులో ఛాతీమీద పరీక్షించి- ఇన్వెస్టిగేషన్స్ చేయించుకురండి రిపోర్ట్స్ చూసి మందులు రాస్తానంటూ' చాంతాడంత లిస్టు రాసి చేతికిచ్చాడు డాక్టరుగారు.

ఆ లిస్టులో C.T. Scan, X Ray, రక్తపరీక్ష, మూత్రం, తెమడ పరీక్ష... అలా చాలా వున్నాయి. అవి చూసి నిజంగానే ఇదేదో పెద్ద జబ్బేనని భయపడ్డాడు రాంబాబు. ఇంతలో ఒక బోయ్ వచ్చి ఏయే పరీక్షలు ఎక్కడెక్కడ చేయించుకోవాలో చెప్పి దగ్గరుండి ఆటో ఎక్కించి పంపాడు.

"చూశావా ఇక్కడ మనకెంత మర్యాదో?" అన్నట్టు చూశాడు మురళి.

"ముందుగా C.T.Scan బ్రెయిన్ తీయించుకుంటే సగం డౌట్ క్లియర్ అయిపోతుందని" ధైర్యం చెప్పాడు మురళి. ఆటోని పక్కసందులో వున్న కుక్కలవీధిలో ఆపి వంద రూపాయలు డిమాండ్ చేశాడు ఆటోవాలా.

'వంద గజాలు లేదు వంద రూపాయలా మరీ అన్యాయం' అన్నాడు మురళి కోపంగా.

C.T.Scan, X Rayలు అయ్యేసరికి పర్సు బరువుసగం తగ్గి పోయింది. ఓపిగ్గా పరీక్షలన్నీ చేయించుకుని డాక్టరుగారి దగ్గరకు చేరేసరికి సాయంత్రం ఆరుగంటలైంది. డాక్టరుగారు పరీక్షలను, C.T.Scan, X Ray రిపోర్టులను అలవోగ్గా రెండు నిముషాలలో చూసేసి, యూ.ఆర్.ఐ.(U.R.I.) అని వ్యాధి నిర్ధారణ చేసి, ప్రిస్క్రిప్షన్ పేపరు నిండా పది రకాల మందులు రాసి 'వీటన్నిటినీ క్రమం తప్ప కుండా వాడి, వారం తర్వాత కలవండి' అన్నాడు కూల్‌గా. ఉదయం నుంచి పేషెంట్స్‌ని చూస్తున్నా ఆయన మొఖంలో విసుగు, చికాకు లాంటివేమీ లేవు. ప్రశాంతంగా నవ్వుతూ రాంబాబును మళ్ళీ రమ్మన్నాడు డాక్టరుగారు.

'డాక్టరుగారు ఎంత మంచి మనిషో చూశావా?' అన్నట్టు చూశాడు మురళి రాంబాబు వంక.

ఆ మందుల జాబితా చూసిన రాంబాబు నీరసం ఇంకా పెరిగింది.

ధైర్యం చెబుతూ డాక్టర్‌గారి రూమ్‌కి ఆనుకుని వున్న మందుల షాపుకు తీసుకెళ్ళాడు మురళి. అద్దాల బీరువాలో అందంగా పేర్చి వున్నాయి మందులు. ఖాళీ పర్సు తడుముకుంటూ "రేపొచ్చి తీసుకుందాం లేరా?" అన్నాడు రాంబాబు.

"డోంట్ వర్రీ మొన్నేగా నేనూ జీతం తీసుకుందంటూ ఒక క్యారీ బేగ్ నిండా మందులు తీసుకొచ్చాడు మురళి.

సిటీ బస్సెక్కి ఇంటికి చేరేసరికి పదిగంటలైంది రాంబాబుకి. భయం భయంగా ఇంట్లోకెళ్ళాడు. నీరసంగావున్న భర్తనుచూసి 'స్వదేశీ వైద్యం ముందు, విదేశీమందు తర్వాతంటూ కషాయం తెచ్చి ఇచ్చింది శ్రీమతి.

దీపావళి పండక్కి కొనుక్కొచ్చిన బాణాసంచాలా సంచినిండా మందులు చూసి అయిన ఖర్చు విని కూచిపూడి, కథాకళి, భరతనాట్యం మిక్స్ చేసి తన బుర్ర బద్దలు కొడుతుందోనని భయపడి... ఆ సంచిని దాచేసి కిక్కురుమనకుండా గ్లాసు కషాయం గటగటా తాగేసి ముసుగు తన్నేశాడు మారుమాట్లాడకుండా, రాంబాబు.

ఉదయం నిద్ర లేచేసరికి జలుబు దగ్గు, హుష్... కాకీ! ఉషారుగా ఈల వేసుకుంటూ మోర్నింగ్ వాక్ బయలుదేరాడు రాంబాబు.

రోజూ మోర్నింగ్ వాకింగ్‌లో కలుస్తున్నా మురళికి U.R.I.(యూ.ఆర్.ఐ.) అంటే అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ ఇన్‌ఫెక్షన్ అనీను, అదంటే 'జలుబ'ని తెలీదు! ఇప్పటికీ U.R.I. అంటే N.R.I.లాగా అదొక ఫారిన్ జబ్బని రాంబాబుతో వాదిస్తూనే వుంటాడు. పాపం పిచ్చి మురళి! ●

"చిన్న పామునైనా పెద్ద కర్రతో కట్టాలి, జలుబని అశ్రద్ధ చేస్తే చూశావా! ఎలా దగ్గుతున్నావో అదే ఊపిరితిత్తులకు పాకి నిమోనియాగా మారవచ్చు, తలకెక్కి సైనస్‌గానో, ముక్కులో ఇన్‌ఫెక్షన్ చెవిలో కెళ్ళి నొప్పి రావచ్చంటూ తన మెడికల్ నాలెడ్జినంతా చెప్పి భయపెట్టాడు మురళి రాంబాబుని. ఆలోచనలో పడ్డాడు రాంబాబు. ఈలోపు ఇంకో దగ్గు తెరవచ్చింది. ఆపుకున్నాడు రాంబాబుకి భయపడి.